క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో కలెక్టర్ దంపతులు



కప్పస్తంభం వద్ద కలెక్టర్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట స్వామికి అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం , జ్ఞాపిక, శేషవస్త్రంలను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందజేశారు.

బాబా సన్నిధిలో అదీప్‌రాజ్



శ్రమశక్తినగర్‌లో బాబాను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, శిరీష దంపతులు

పెందుర్తి: గురు పౌర్ణమిని పురస్కరించుకుని జీవీఎంసీ 97వ వార్డు శ్రమశక్తినగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. బాబాకు అభిషేకాలు జరిపి, అలంకరణ చేశారు. బాబాను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాంపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, పార్టీ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు దర్శించుకున్నారు.

లుపిన్ ఫార్మా ప్రమాదంలో ఒకరికి అస్వస్థత

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని లుపిన్ ఫార్మా పరిశ్రమలో ఓ కార్మికుడు స్వల్ప అస్వస్థతకు గురైనట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రొడక్షన్ బ్లాక్‌లో కెమిస్టుకు హెల్పర్‌గా ఉన్న ఒడిశాకు చెందిన పండా లక్ష్మణ్‌కుమార్ రియాక్టర్‌లో సాల్వెంట్‌ను పంపుతున్న సమయంలో వాంతులు చేసుకున్నాడు. అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మణ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని పరమేశ్వరరావు తెలిపారు. భద్రతా వైఫల్యంతోపాటు, ప్రమాద విషయాన్ని గోప్యంగా ఉంచిన యాజమాన్యంపై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

నిత్యావసర సరకుల వితరణ

పరవాడ: ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్న సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన పెదపాటి నానాజీ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను 85వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజి సురేష్ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అతని కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందించారు. ఆయన వెంట రాష్ట్ర మేదర సంఘ ముఖ్య సలహాదారు ఆరి రవికుమార్, అప్పికొండ అప్పారావు, తిప్పాన సురేష్, తురసాల శ్రీనివాసరావులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 2 వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం ,దోసూరు గ్రామ పంచాయతీల ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

'దాదాపు రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టి సిమెంట్ రోడ్డు వేశాను. కాలువలు నిర్మించేందుకు సిద్ధమవుతుంటే ఒక్కసారిగా బిల్లులు నిలిచిపోయాయి. ఏడు నెలలుగా ఆ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నాను. అప్పులు చేసి పనులు చేయించడంతో, వాటికి వడ్డీలు కట్టుకోలేక అవస్థలు పడుతున్నా. అధికారులను అడిగితే రేపుమాపు అంటున్నారే తప్ప ఫలితం ఉండట్లేదు'

- పెందుర్తి మండలంలో కూటమికి చెందిన ఓ నేత ఆవేదన

'మా ప్రాంతానికి సిమెంట్ రోడ్డు వస్తుందంటే ఆనందించాం. కాలువల కోసం మా ఇంట్లోకి వెళ్లేందుకూ ఇబ్బంది పడేలా తవ్వేశారు. కొద్దిరోజుల్లో కాలువ పూర్తవుతుందనుకున్నా నెలలు గడుస్తున్నా పనుల జాడే లేదు. రోడ్డు మీద నుంచి ఇంట్లోకి వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతున్నాం. చాలాసార్లు స్టెయిర్ మీది నుంచి పడి దెబ్బలు తగిలించుకున్నాం. ఇదేనా ప్రభుత్వ తీరు'

- పెందుర్తి మండలం పినగాడికి చెందిన ఓ వ్యక్తి ఆక్షేపణ



కోట్నివానిపాలెం కాలనీలో కాలువ నిర్మాణం నిలిచిపోవడంతో ఇంట్లోకి వెళ్లేందుకు ప్రత్యేకంగా నిచ్చెన చేయించుకున్న గృహ యజమాని

బిల్లులు చెల్లించక.. పనులు సాగక!

- ఉపాధి హామీ పనుల బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ల గగ్గోలు
- పెందుర్తి మండలంలో రూ.2.36 కోట్ల బిల్లుల పెండింగ్
- 7 నెలలుగా బిల్లులు చెల్లించక.. అర్ధంతరంగా నిలిచిన పనులు
- ఎక్కడికక్కడ తవ్వి వదిలేయడంతో అవస్థలు పడుతున్న ప్రజలు

పెందుర్తి: సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాల మాట అటుంచితే అభివృద్ధి పనుల్లోనూ అడుగడుగునా ఆపసోపాలు పడుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గత ఏడాది ఎంతో ఆర్భాటంగా మొదలుపెట్టిన అభివృద్ధి పనులు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. దాదాపు ఏడు నెలలుగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఎక్కడికక్కడ కాడి వదిలేశారు.

జరగాల్సిన అభివృద్ధి పనులు నిలుపుదల చేసి, రావాల్సిన బిల్లుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు అభివృద్ధి చేస్తామని ఎక్కడికక్కడ రోడ్లు, కాలువల కోసం తవ్వకాలు జరిపి మధ్యలోనే వదిలేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.



బిల్లులు రాకపోవడంతో పినగాడి పంచాయతీలో నిలిచిపోయిన కాలువల నిర్మాణం



పెదగాడిలో బిల్లులు నిలిచిపోవడంతో అసంపూర్తిగా మిగిలిన గ్రంథాలయం

ఏడు మాసాలుగా ఎదురుచూపులే..

పనులు పూర్తి చేసిన రెండు వారాల్లోనే బిల్లులు చెల్లిస్తామని బీరాలు పలికిన కూటమి పెద్దలు మాట తప్పారు. రెండు వారాలు కాస్తా ఏడు నెలలైనా బిల్లులకు అతీగతీ లేదు. 110 పనులకు గాను పెందుర్తి మండలంలో దాదాపు రూ.2.36 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. తొలుత ఎంతో ఉత్సాహంగా కాంట్రాక్టులు తీసుకున్న కూటమి నాయకులు ఇప్పుడు పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తెల్లమొహాలు వేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా ఎక్కడికక్కడ కాలువలు, ఇతర నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం వర్షాలు ముమ్మరంగా పడుతుండడంతో మధ్యలో ఆగిన పనులతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఆగిపోయిన పనుల్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

అంతా ప్రచారార్భాటమే..!

నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతం అభివృద్ధి కోసం గతేడాది జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి దాదాపు రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో పెందుర్తి మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధి 15 పంచాయతీలలో 110 పనులకు గాను దాదాపు రూ.3 కోట్లు పైగా కేటాయించారు. ఆయా పనులన్నీ దాదాపు కూటమి నాయకులకు, వారికి అనుకూలంగా ఉన్నవారికే అప్పగించారు. నవంబర్, డిసెంబర్‌లలో ఎంతో ఆర్భాటంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కూటమి నాయకులు ఆయా పనులకు శ్రీకారం చుట్టి ప్రచారం చేసుకున్నారు. దాదాపు అన్ని పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించి చాలా చోట్ల రోడ్డు పూర్తిచేశారు. బిల్లులు వస్తే మిగిలిన రోడ్లు, కాలువలు, ఇతర నిర్మాణాలు చేసేందుకు సిద్ధమయ్యాయి.

త్వరలో నిధుల విడుదల



ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లుల కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే ఆయా బిల్లులు వస్తాయని భావిస్తున్నాం. మిగిలిపోయిన పనులు కూడా పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

– అప్పలరాజు, ఎంపీడీవో, పెందుర్తి

సత్యదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



పెందుర్తి: గురు పౌర్ణమి సందర్భంగా పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

సచివాలయ సిబ్బందికి సాదర వీడ్కోలు



సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న చందుయాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు

పెందుర్తి: ఆరేళ్లుగా పురుషోత్తపురం ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించి, బదిలీపై వెళుతున్న స్థానిక సచివాలయ సిబ్బందిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. పురుషోత్తపురంలోని సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు చందుయాదవ్, నాయకులు యలమంచలి శ్రీను, ఆబోతు వెంకటరమణ, ఆబోతు శ్రీను తదితరులు సిబ్బందిని సత్కరించి, జ్ఞాపికలు అందించారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో గురు పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గురుపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి చండీ సప్తశతి పారాయణం చేశారు. గురుమంత్ర హోమం నిర్వహించి గురుపాదుకా పల్లకీ సేవ, గురుపూజోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవిద్య అడ్వాన్స్‌డ్ కోర్సు అభ్యసిస్తున్న దేశ, విదేశాలకు చెందిన అభ్యాసకులు పాల్గొని గురువుపై తమ గౌరవాభిమానాలను చాటుకున్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ అభ్యాసకులను ఆశీర్వదించారు.

విద్యార్థి దశ నుంచే బంగారు భవితకు బాటలు

- నందడిగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్



పరవాడ బాలికల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి



వెన్నలపాలెం ఎలిమెంటరీ స్కూల్‌కు సౌండ్ సిస్టం బహూకరిస్తున్న ఉపసర్పంచ్ సన్యాసిరావు



అడవివరం జెడ్పీ హైస్కూల్లో మ్యూజికల్‌చైర్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న తల్లులు



అడవివరం బీసీ గురుకుల పాఠశాలలో తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు



సింహాచల్‌నగర్‌లోని ఎంపీపీ స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులు



పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ వసంత, తదితరులు



టెన్త్ ప్రతిభావంతులకు జ్ఞాపికలు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు

పరవాడ: విద్యార్థులు భవిష్యత్ విజయావకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇప్పటి నుంచే అడుగులు వేయాలని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జెడ్పీ స్కూల్, ఎలిమెంటరీ స్కూళ్లలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పాల్గొని, మాట్లాడారు. విద్యార్థి జీవితంలో పాఠశాల స్థాయి నుంచే మానసిక, శారీరక అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. పరవాడ ఎంపీటీసీ పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు, విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిర పరపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, పైల రాధాకృష్ణ, టీవీ అప్పారావు, కూండ్రపు సోమునాయుడు, వ్యవసాయాధికారి ఎం.రమాదేవి, అప్పలనాయుడు, వెన్నల సన్యాసిరావు, పైల హరీష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- మండలంలో వాడచీపురుపల్లి, మెట్టపాలెం జెడ్పీ స్కూళ్లు, వెన్నలపాలెం ప్రాథమిక పాఠశాల, తానాం గురుకుల పాఠశాల, ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎంలు ఘనంగా నిర్వహించారు. వెన్నలపాలెం ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్‌కు స్థానిక ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెన్నల సన్యాసిరావు మినీ సౌండ్ సిస్టమ్‌అందించారు.

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ, శాంతినగరం, పులగవానిపాలెంలలోని ప్రాథమిక పాఠశాలలు, జెడ్పీ హైస్కూళ్లలో మెగా పీటీఎం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ వసంత పాల్గొని తల్లులకు పిల్లలచే పాదపూజ చేయించారు. స్థానిక నాయకులు సేనాపతి శంకరరావు, ఆవగడ్డ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరంలోని మహాత్మా జ్యోతీబా పూలే ఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు థగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. తల్లులకు విద్యార్థులచే పాదపూజ జరిపించారు. ప్రిన్సిపాల్ రమామోహిని, వైఎస్ ప్రిన్సిపాల్ భానుమతి, ఉపాధ్యాయులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో మెగా పీటీఎంలో భాగంగా తల్లిదండ్రులకు వివిధ పోటీలు సందడిగా నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- సింహాచలనగర్‌లోని ఎంపీపీ స్కూల్లో తల్లులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్ పోటీలు పెట్టి, విద్యార్థులచే తల్లులకు పాదపూజలు చేయించారు. హెచ్‌ఎం గేదెల సన్యాసిరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సబ్బవరం: ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో గురువారం నిర్వహించిన మెగా పీటీఎంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించి, అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వైస్ ఎంపీపీ–2 మామిడి లక్ష్మి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్‌డీ అనిత, హెచ్‌ఎం తిరుపతిరావు, ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.శిరీషరాణి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు దృష్టికి బర్ధన్‌నగర్ సమస్యలు



సమస్యను సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



బర్ధన్‌నగర్ కాలనీ సమస్యలపై సాక్షి ప్రచురించిన కథనం

- సీఎంను కలిసి వినతిపత్రాన్ని అందించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని బర్ధన్‌నగర్ కాలనీ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి సీపీఐ నేతలు తీసుకువెళ్లారు. విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎంను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కలిసి కాలనీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను వివరించారు. దాదాపు పుష్కరకాలం క్రితం ఏర్పడిన ఈ కాలనీలో నేటికీ కనీస మౌలిక సదుపాయాలు లేవని వివరించారు. తక్షణమే విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ మేరకు కాలనీ సమస్యలు పొందుపరిచిన వినతిపత్రంతో పాటు, కాలనీ సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపిన సాక్షి కథనం 'చీకటి బతుకులు'ప్రతిని కూడా జతచేసి సీఎంకు అందించారు. కాగా కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు సీపీఐ నేతలు వెల్లడించారు. ముందుగా బర్ధన్‌నగర్ కాలనీ సమస్యలను రామకృష్ణకు సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహమాన్ ఆధ్వర్యంలో సీపీఐ నేతలు సత్యనారాయణమూర్తి, ఆర్ శ్రీనివాస్, వై.త్రినాథ్ వివరించారు.

భక్తుల సేవలో మేటిగా..

- అడుగడునా భక్తులకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు



గోశాల జంక్షన్ వద్ద భక్తులకు టీ అందిస్తున్న స్థానిక నివాసితులు

సింహాచలం: గిరి ప్రదక్షిణ ఉత్సవంలో స్వచ్ఛంద సంస్థల సేవలు భక్తులతో భేష్ అనిపించుకున్నాయి. కొండదిగువ పాతగోశాల కూడలి నుంచి తొలిపావంచా వరకు పలు స్వచ్ఛంద సంస్థలు దారి పొడవునా భక్తులకు టీ, కాఫీ, మంచినీరు, అల్పాహారాలు, పులిహోర, బిస్కెట్లు అందించాయి.

- పాత గోశాల జంక్షన్ నుంచి తొలిపావంచాకు వెళ్లే మార్గంలో నివాసితులు భక్తులకు టీ అందించారు. నడవలేని భక్తుల వద్దకే టీ తీసుకెళ్లి మరీ అందించారు.
- పాత గోశాల జంక్షన్‌లో హెచ్‌పీ పెట్రోల్‌బంక్ ఆధ్వర్యంలో భక్తులకు ఉప్మా, పూరీ అందించారు.
- మారుతి కల్యాణమండపం వద్ద శ్రీనృసింహ దీక్షాదారుడు, సింహాద్రిమఠం గురుస్వామి కోరెడ్డి సురేంద్రస్వామి ఆధ్వర్యంలో భక్తులకు కదంబం, దద్దోజనం పంచారు.
- ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ పరివారం ఆలయ దక్షిణరాజగోపురం మార్గంలో భక్తులందరికీ పొంగళి ప్రసాద వితరణ చేపట్టారు.
- సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులందరికీ కదంబం, దద్దోజనం అందించారు.
- పాత గోశాల వద్ద ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ఉప్మా, బూందీ పంపిణీ చేశారు.
- అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సింహగిరిపై మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

గిరి ప్రదక్షిణలో తరించిన భక్తజనం

- పెద్ద ఎత్తున తరలివచ్చిన గ్రామీణ ప్రాంతాల భక్తులు
- తొలిసారి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నవారు ఈసారి ఎక్కువే

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని స్మరిస్తూ బుధవారం ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో లక్షలాదిమంది భక్తులు తరించారు. భక్తి శ్రద్ధలతో 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణను పూర్తి చేశారు. వారంతా గురువారం తిరిగి సింహాచలం చేరుకున్నారు. మదినిండా స్వామిని నిలిపి, తమ ఇళ్లకు తిరుగుపయనమయ్యారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. తొలిసారి గిరి ప్రదక్షిణ చేసినవారు అధికంగా ఉన్నారు. వీరిలో మహిళలు, యువతే ఎక్కువ కావడం విశేషం. శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామిని తమ ఇలవేల్పుగా పూజించే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణప్రాంతాల భక్తులు కుటుంబసమేతంగా వచ్చి గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణ ఒక కొత్త అనుభూతిని మిగిల్చిందని పలువురు భక్తులు తమ అనుభవాలను వెల్లడించారు.





గిరి ప్రదక్షిణ చేసి తిరుగు పయనం అవుతున్న భక్తులు

వివాహం కోసం మొక్కుకున్నా



నేను బీఎస్సీ పూర్తిచేశాను. ఇప్పటికి రెండుసార్లు గిరి ప్రదక్షిణ చేశాను. ఇంట్లో పెళ్లిచేస్తానంటే మంచి సంబంధం రావాలని, గిరి ప్రదక్షిణ చేస్తానని మొక్కుకున్నా. అనుకున్నట్టే మంచి వ్యక్తితో వివాహం జరిగింది. నా కోర్కెను అప్పన్నస్వామి నెరవేర్చాడు. అందుకే మూడోసారి గిరి ప్రదక్షిణ చేశాను.

- మహానందీశ్వరి, పిఠాపురం

తొలిసారి గిరిప్రదక్షిణ



నేను తొలిసారి గిరి ప్రదక్షిణ చేశాను. ఉభయ గోదావరి జిల్లాల నుంచి చాలా మంది గిరి ప్రదక్షిణకు వచ్చారు. మావీధిలో ఉండేవారితో కలిసి నేనూ ఇక్కడికి వచ్చాను. 32 కి.మీ. గిరి ప్రదక్షిణ ఉత్సవం నిజంగా నా జీవితంలో చాలా ప్రత్యేకం. నాలో కొత్త అనుభూతిని ఈ ఉత్సవం నింపింది.

- భవనేశ్వరి, మార్టేరు, పశ్చిమగోదావరి జిల్లా

కుటుంబం బాగుండాలని



బుధవారం సాయంత్రం 4 గంటలకు తొలిపావంచా నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించా. గురువారం ఉదయం 8.30కు తిరిగి సింహాచలం వచ్చా. సింహగిరికి వెళ్లి స్వామిని దర్శించుకున్నా. మాది చాలా పెద్ద కుటుంబం. మా కుటుంబం అంతా బాగుండాలని స్వామిని మొక్కుకుని గిరి ప్రదక్షిణ చేశా.

- రమాదేవి, పార్వతీపురం

బాగా చదువుకోవాలని..



నేను ఇంటర్ చదువుతున్నా. మా బంధువులు, స్నేహితులతో కలిసి తొలిసారి సింహాచలం గిరి ప్రదక్షిణకు వచ్చాను. బాగా చదువుకుని జీవితంలో మంచి స్థాయికి వెళ్లాలని ఆ స్వామిని వేడుకుని గిరి ప్రదక్షిణ చేశాను. ఆ స్వామి కోరిన కోర్కెలు తీర్చుతాడని నాకు, మా వాళ్లకు చాలా నమ్మకం.

- దీపిక, విజయనగరం

అవే ట్రాఫిక్ కష్టాలు

గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులతో పాటు సామాన్య వాహనదారులు రెండో రోజూ ట్రాఫిక్ కష్టాలను చవిచూశారు. గిరి ప్రదక్షిణ అనంతరం అప్పన్న స్వామిని దర్శించుకుని ఇళ్లకు బయలుదేరిన భక్తులు వేపగుంట కూడలి వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. గంటల కొద్దీ వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

- పెందుర్తి



వేపగుంట కూడలి వద్ద ట్రాఫిక్‌లో బారులుతీరిన వాహనాలు